www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 21 సెప్టెంబరు 2024
5
ఏలూరు



పోలీసు సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

పోలీసు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని, సిబ్బందికి అన్ని సౌకర్యాలను కల్పించే దిశగా కృషి చేస్తున్నామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీసు సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని సిబ్బంది బాధక సాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బందికి పలు సమస్యలు ఎదురవ్వడం సాధారణంగా జరిగే ప్రక్రియని, ఆ సమస్యలను సైతం పూర్తిగా తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తనను సంప్రదించవచ్చని చెప్పారు.

'మాల్స్'లో వెట్టిచాకిరీ..!

- రోజుకు పది నుంచి 12 గంటలు పని
- వేతనం నెలకు రూ.పది వేలలోపే
- ఉదయం నుంచి నిల్చొని ఉండాల్సిందే
- మాల్స్‌లో ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతం
- పట్టణాల్లో పెద్దఎత్తున మాల్స్ ప్రారంభం
- కొరవడిన అధికారుల తనిఖీలు..
- ఇష్టానుసారంగా యాజమాన్యాలు



ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లో షాపింగ్‌మాల్స్‌తోపాటు మార్ట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గడిచిన రెండు, మూడేళ్లలో ఏలూరులో అతిపెద్ద కార్పొరేట్ షాపింగ్‌మాల్స్, మార్ట్‌లు అనేకం ప్రారంభమయ్యాయి. మాల్స్‌లో పని చేసేందుకు స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళలు, యువకులు పని చేసేందుకు వస్తున్నారు. అత్యధికంగా మహిళలు ఉంటున్నారు. ప్రతి షాపింగ్‌మాల్, మార్ట్‌ల్లోనూ వందల సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నారు. మాల్స్‌లో ఎక్కడా కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. మాల్స్ యాజమాన్యాలు పాటిస్తుందే చట్టం.. వారు అవలంభిస్తున్న నిబంధనలే శిరోధార్యం అన్నట్లు పరిస్థితి తయారైంది. అధికారుల తనిఖీలు పూర్తిగా కొరవడటంతో మాల్స్‌లో పని చేసే ఉద్యోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. సరైన ఉపాధి లేకపోవడంతో అనేక మంది యువత మాల్స్‌లో పని చేసేందుకు వస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుని మాల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా పని గంటల విషయంలో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతున్న పరిస్థితి ఉంది. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులతో రోజుకు పది నుంచి 12 గంటలు పని చేయిస్తున్నారు. ఉదయం పది గంటలకు పని ప్రారంభిస్తే రాత్రి పది గంటల వరకూ ఉంచుతున్నారు. ఉద్యోగులకు వేతనాలు సైతం అత్యంత దారుణంగా ఇస్తున్నారు. రూ.ఏడు వేల నుంచి రూ.పది వేలలోపు జీతం తీసుకునే ఉద్యోగులే అధికంగా ఉంటున్నారు. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులకు కార్మికచట్టాల నిబంధనలను అమలు చేయాల్సి ఉంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. జిల్లా కేంద్రం ఏలూరులో పరిస్థితి మరింత దారుణంగా ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

చట్టంలోని నిబంధనలు పట్టవా..!

కార్మిక చట్టాల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పని చేయించాలి. అంతకుమించి ఎక్కువ పని గంటలు చేస్తే ఓటి కింద రెట్టింపు వేతనం చెల్లించాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ప్రతి ఉద్యోగిని చేర్చుకునేటప్పుడు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలి. కనీస వేతనం చెల్లించాలి. పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలి. వెల్ఫేర్ ఫండ్ కట్టాలి. ప్రతియేటా బోనస్ చెల్లించాలి. ఐదేళ్లు దాటిన ఉద్యోగులకు గ్రాట్యుటీ ఇవ్వాలి. పురుష, మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. మహిళలకు ప్రసూతి సెలవులు అమలు చేయాలి. క్యాజువల్ లీవులు ఇవ్వాలి. మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించాలి. మాల్స్‌లో ఎక్కడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. కొన్ని మాల్స్ యాజమాన్యాలు పిఎఫ్, ఇఎస్ఐ వంటివి పది, ఇరవై మంది ఉద్యోగులకు అమలు చేసి వాటినే రికార్డుల్లో చూపిస్తున్నాయి. ఆదివారం, పండుగ దినాల్లోనూ పని చేయిస్తున్నా అదనంగా ఎటువంటి వేతనమూ ఇవ్వడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిలువుకాళ్లపై నిలబడి పని చేస్తుండటంతో మోకాళ్ల నొప్పులతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు మాల్స్‌లో పని చేసే ఉద్యోగులను వెంటాడుతున్నాయి. కుటుంబ సభ్యులతో గడిపే సమయం లేకుండాపోతోంది. ఉద్యోగులు ఎవరైనా ప్రశ్నిస్తే తొలగించడంగాని, వారి నుంచి తీసుకున్న సర్టిఫికెట్లు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. పెద్దఎత్తున లాభాలు కూడగట్టుకుంటున్న మాల్స్ యాజమాన్యాలు అక్కడ పని చేసే ఉద్యోగులను మాత్రం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అధికారుల తనిఖీలు లేకపోవడంతో మాల్స్‌లో నిబంధనలు అమలుకాని పరిస్థితి నెలకొంది. మాల్స్‌లో సీసీ కెమెరాలు ఉంటాయి. ఉద్యోగులు ఎన్ని గంటలకు వస్తున్నారు.. ఎన్ని గంటలకు వెళ్తున్నారో పక్కాగా తెలుస్తోంది. అయినప్పటికీ ఏఒక్కరూ పట్టించుకోని పరిస్థితి ఉంది. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులు రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకపోతే శ్రమ దోపిడీ మరింత పెరిగే పరిస్థితి ఉంది.



ధర్నాలో నినదిస్తున్న నేతలు

శశికుమార్‌ను కఠినంగా శిక్షించాలి

వసతిగృహం వద్ద వామపక్షాలు, కాంగ్రెస్, పలు సంఘాల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన కీచకుడు శశికుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం నగరంలోని అమీనాపేట టవర్ ప్రయివేటు వసతిగృహంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వార్డెన్ భర్త శశికుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీ, పౌర హక్కుల సంఘం, మహిళా సంఘాల ప్రతినిధులు వసతిగృహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు నడిబొడ్డున వసతి కల్పన పేరుతో పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. అక్రమంగా వసతిగృహం నడుస్తున్నా ప్రభుత్వ యంత్రాంగానికి తెలియక పోవడం సిగ్గుచేటని విమర్శించారు. శశికుమార్‌పై పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు రక్షణ కల్పించి వారి చదువులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ దాదాపు రెండు సంవత్సరాల నుండి ఈ వసతి గృహాన్ని అనుమతులు లేకుండా నిర్వహిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సిపిఎం నగర కార్యదర్శి పల్లెం కిషోర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఏలూరులో ఇంతటి దారుణానికి పాల్పడిన శశికుమార్‌ను కఠినంగా శిక్షించాలని, ఈ కేసులో లోతైన దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్ స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థినులపై అఘాయిత్యాలకు పాల్పడిన శశికుమార్‌తోపాటు వార్డెన్ మణిశ్రీ, సహకరించిన అందరినీ కఠినంగా శిక్షించాలన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థినులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వేములు మల్లిక మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు ఉప్పులూరి హేమశంకర్, మావూరి విజయ, అధ్యక్ష లక్ష్మీబిందిరా, నాగం అచ్యుత్, కె.రామాంజనేయులు, వివివిఎస్.ప్రసాద్, అరుణ తార, నాగేశ్వరరావు, శ్యామల, కాకి నాని, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

జిఒ 85కు వ్యతిరేకంగా పిహెచ్‌సి వైద్యుల నిరసన

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

జిఒ నెం.85కు వ్యతిరేకంగా జిల్లాలోని పిహెచ్‌సి వైద్యులు ఎపి పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోండ్రుపాడు పిహెచ్‌సి డాక్టర్ శ్రీ రమ్య మాట్లాడుతూ 30 శాతం ఉన్న ఇన్‌సర్వీస్ కోటాను 15 శాతం చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల అవసరం లేదంటూ ఇచ్చిన జిఒ అటు వైద్యులకు, ఇటు సామాన్యులకు, గిరిజనులకు పెనుశాపంలా మారిందని డాక్టర్లు తెలిపారు. శాంతియుతంగా నిరసన కూడా తెలుపనీయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని వాపోయారు. కోవిడ్‌లో సైతం ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించింది ప్రభుత్వ వైద్యులేనన్నారు. అలాంటి తమకు కనీస హక్కులు లేకుండా కాలరాయడం అత్యంత బాధాకరమన్నారు. తక్షణం ఆ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్ర, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

లైంగిక వేధింపులపై సమగ్ర దర్యాప్తు

ఎస్ఎఫ్ఐ, ఐద్వా రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

స్థానిక దయానంద సరస్వతి ఆశ్రమంలో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన శశికుమార్ వెంటనే పొక్సో చట్టం కింద అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సమావేశం స్థానిక పవర్‌పేటలోని ఐద్వా కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఐద్వా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు ఎ.శ్యామలారాణి, కె.లెనిన్ మాట్లాడుతూ స్వామి దయానంద సరస్వతి వసతిగృహంలో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన శశికుమార్‌ను, అతనికి సహకరించిన వార్డెన్ ఫణిశ్రీ, కేర్‌టేకర్ లావణ్యలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతిగృహాల్లో ఖాళీలు లేనందున ఆ వసతి గృహంలో చేరాలని ప్రభుత్వాధికారులే ప్రోత్సహించి పంపారన్నారు. దీనికి ప్రభుత్వ గుర్తింపు లేకున్నా సిఫార్సులు చేయడం ద్వారా అధికారులకు, ఆశ్రమం నిర్వాహకులకు మధ్య ఉన్న సంబంధం స్పష్టమవుతోందని అన్నారు. ఈ ఘటనపై నేటికీ ప్రజాప్రతినిధులు ఎవ్వరూ స్పందించకపోవడం, అధికారులు కూడా నిర్వాహకులపై కొద్దిపాటి చర్యలు తీసుకుని చేతులు దులుపుకోవడం బాధాకరమన్నారు. తక్షణమే దోషులపై పొక్సో చట్టం అమలు చేయాలని, ఈ కేసు తప్పుదోవ పట్టకుండా సిబిఐచే విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థినులు ప్రభుత్వ వసతి కల్పించాలని కోరినా స్పందన లేకపోవడం దారుణమన్నారు. 'భేటీ పడావో, భేటీ బచావో' నినాదం కేవలం కాగితాలకు, మాటలకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దయానంద సరస్వతి ఆశ్రమంలోని విద్యార్థినులు శశికుమార్ వేధింపులకు గురై భయాందోళనకు గురై కళాశాలకు వెళ్లలేని పరిస్థితి వచ్చిందన్నారు. వారికి ధైర్యం చెప్పి కళాశాలకు వెళ్లేలా చేసే ప్రయత్నమూ అధికారుల నుంచి లేదని విమర్శించారు. వెంటనే బాలికల తల్లిదండ్రులతో మాట్లాడి వారు కోరిన పభుత్వ హాస్టల్లో వసతి కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని సంఘాలనూ కలుపుకుని శనివారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో ఐద్వా నేతలు జి.శారద, అరుణ కుమారి, విద్యార్థి సంఘాల నాయకులు కె.నాని, క్రాంతి పాల్గొని మాట్లాడారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు

ట్రిపుల్ ఐటీ అధికారులకు రాష్ట్ర కళాశాల విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆదేశం

మెస్‌లు, కిచెన్‌లో ఆహార తయారీ పరిశీలన

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర కళాశాల విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం అందిస్తున్న కారణంగా రెండు నెలలుగా విద్యార్థులు అనారోగ్యం బారిన పడడం, విద్యార్థుల ఫిర్యాదుపై జిల్లా అధికారులు ట్రిపుల్ ఐటీలో ఆహారం, ఇతర సౌకర్యాల పరిశీలన, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకస్మిక తనిఖీ చేసి ఆహారం నాణ్యత లేదని నిర్ధారించడంతో రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ట్రిపుల్ ఐటీని సందర్శించి పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో ట్రిపుల్ ఐటీ అధికారులు, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో పోలా భాస్కర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీలో చోటుచేసుకున్న పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. ట్రిపుల్ ఐటీని పూర్తిస్థాయిలో ప్రక్షాళించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సేవలందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెస్ కాంట్రాక్టర్‌ను మార్చి కొత్తగా టెండర్లు పిలవాలన్నారు. మెస్ కాంట్రాక్టర్ ఎంపిక నిమిత్తం కమిటీ నియమించి, ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా అమలు చేసేవారికే కాంట్రాక్టు అప్పగించాలన్నారు. కొత్త కాంట్రాక్టర్ తప్పనిసరిగా నాణ్యమైన ఆహార సరుకులు వినియోగించేలా పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆహార తయారీ కిచెన్, డైనింగ్ హాల్స్ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆహార నాణ్యతను, పారిశుధ్యాన్ని పర్యవేక్షించేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలని, కమిటీలో పౌష్టికాహార నిపుణులు, ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థుల ప్రతినిధులు తదితరులు సభ్యులుగా ఉండాలని, కమిటీ ప్రతి వారం సమీక్షించుకుని విద్యార్థులకు మెరుగైన సేవలందించే దిశగా పని చేయాలన్నారు. ట్రిపుల్ ఐటీలో సీసీ కెమెరాల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. ఈ సందర్భంగా మెస్ కాంట్రాక్టర్ల ఎంపిక, విద్యార్థులకు సౌకర్యాలు కల్పన తదితర అంశాలపై ట్రిపుల్ ఐటీ అధికారులకు పోలా భాస్కర్ పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి ఛైర్మన్ రామ్మోహన్‌రావు, నూజివీడు ఆర్‌డిఒ వై.భవానీశంకరి, ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బండి ప్రసాద్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



కిచెన్‌ను పరిశీలిస్తున్న అధికారులు


మెస్, కిచెన్ పరిశీలన

నూజివీడు ట్రిపుల్ ఐటీలోని విద్యార్థుల మెస్, కిచెన్, డైనింగ్ హాళ్లను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి డాక్టర్ పోలా భాస్కర్ పరిశీలించారు. ముందుగా ఒకటో నెంబర్ మెస్‌ను పరిశీలించి, అక్కడ ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అక్కడున్న భోజనం చేస్తున్న విద్యార్థులను కలిసి భోజనం నాణ్యత, వారి సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికల మెస్‌ను పరిశీలించి భోజనం నాణ్యత, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిచెన్‌లో ఆహారం తయారీ విధానాన్ని, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం ఆహార తయారీకి వినియోగించే సరుకుల నాణ్యతను కమిషనర్ పరిశీలించారు.

కీచక శశికుమార్ అరెస్టు

అతని భార్య, మరో యువతి అరెస్టు

త్వరగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం : ఎస్‌పి



వివరాలు తెలుపుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

నగరంలో శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన శశికుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతనితో పాటు అతని భార్యను, మరో యువతిని అరెస్టు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో శుక్రవారం సాయంత్రం ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నగరంలోని గ్రీన్‌సిటీ ప్రాంతానికి చెందిన బొమ్మిరెడ్డిపల్లి శశికుమార్ తండ్రి సోమరాజు హిందీ ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. ఆయన 1988లో మృతి చెందారు. దీంతో కారుణ్య నియామకంలో శశికుమార్‌కు భీమవరం ప్రాంతంలో ఆఫీస్ సబర్డినేట్‌గా ఉద్యోగం వచ్చింది. భీమవరం, జిన్నూరు, ఏలూరు డిఎన్‌టి బాయ్స్ హాస్టళ్లలో ఇతను పనిచేశాడు. అనంతరం 2014లో శశికి హాస్టల్‌వార్డెన్‌గా ఉద్యోగోన్నత లభించింది. ఇతను వార్డెన్‌గా భీమవరం జిల్లా పాలకొల్లు, పెనుగొండ, ఏలూరు జిల్లా కుక్కునూరు, ఉంగుటూరులలో పని చేశాడు. ప్రస్తుతం ఎర్రగుంటపల్లి బాలుర వసతి గృహంలో పని చేస్తున్నాడు. ఇతని మొదటి భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమె కూడా మృతి చెందడంతో ఏలూరు నగరానికి చెందిన ఫణిశ్రీని మూడో వివాహం చేసుకున్నాడు. ఆమెతో గ్రీన్ సిటీలో నివాసం ఉంటున్నాడు. నగరంలో ఇతను మనీ డిజిటల్ ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. నగరానికి మహిళ ఫొటోగ్రాఫర్లను పరిచయం చేసింది ఇతనేనని నగరంలో పలువురు చెబుతూ ఉంటారు. ఆ సమయంలో వారిని లైంగికంగా లోబరుచుకుని మాత్రమే ఫొటోగ్రఫీ నేర్పించేవాడని కూడా పుకార్లు షికారు చేసేవి. నగరంలో శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమం బాలికల వసతి గృహం పేరుతో దయానంద సరస్వతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్నారు. మొదట ఈ స్వచ్ఛంద సంస్థను దయానంద స్వామి ఆధ్వర్యంలో ఓ వ్యక్తి నిర్వహిస్తుండేవాడు. ఆ వ్యక్తితో పరిచయం పెంచుకున్న శశి దయానంద స్వామికి దగ్గరై ఆయనకు మాయమాటలు చెప్పి అతని భార్య ఫణిశ్రీని నిర్వాకురాలిగా నియమించేలా చేశాడు. ఆమె మేనకోడలుగా బయ్యారపు లావణ్య అనే యువతిని కూడా ఈ స్వచ్ఛంద సంస్థకు పరిచయం చేసి ఆమెను కేర్ టేకర్‌గా ఏర్పాటు చేశాడు. వీరిద్దరి సమక్షంలో స్వచ్ఛంద సేవా సంస్థను ఆశ్రయంగా చేసుకుని బాలికలు నివసించే ప్రాంతంలో రాత్రులు కూడా అతను సంచరించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను లావణ్య బలవంతంగా శశికుమార్ కారులో ఎక్కించగా అతను బాలికను బాపట్లలోని ఇదే ఆశ్రమానికి చెందిన మరో బ్రాంచ్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడ నుంచి బాలికను తీసుకొచ్చి ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపుతానని బెదిరించాడు. అంతేకాకుండా ఆ బాలికను, గదిలో ఉంటున్న మిగిలిన బాలికలను ఆరోజు రాత్రి 11 గంటల సమయంలో సరిగ్గా చదవడం లేదనే వంకతో చితకబాదాడు. ఈ నెల 17వ తేదీన ఆ బాలికలంతా కలిసి ఏలూరు రెండో పట్టణ పోలీసులకు జరిగిన విషయాన్ని చెప్పి ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి రెండో పట్టణ సిఐ రమణ కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులను శుక్రవారం పాత బస్టాండ్ సమీపంలో అరెస్టు చేశారు. మూడు నెలల నుంచి శశికుమార్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని, నిందితులకు వీలైనంత ఎక్కువ శిక్ష పడేలా చర్యలు చేపడుతున్నామని ఎస్‌పి తెలిపారు.

శశికుమార్‌పై పలు ఆరోపణలు

శశికుమార్ మనీ డిజిటల్ ఫొటో స్టూడియో ఏర్పాటు చేసిన తర్వాత ఎక్కువగా మహిళలకే ఫొటోగ్రఫీ నేర్పిస్తానని చెప్పి పలువురిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని అప్పట్లోనే పలు ఆరోపణలు ఉండేవి, కాని ఎవరూ ఇతనిపై ఇప్పటివరకు ఫిర్యాదు చేయలేదు. అంతేకాకుండా గ్రీన్ సిటీలో పెద్ద ఎత్తున ఇతను వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తూ ఉంటాడని కూడా స్థానికులు చెబుతున్నారు.

శనివారపుపేట కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి

వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా చర్యలు

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. అదే లక్ష్యంతో సమయపాలనతో హామీల అమలుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏలూరు శనివారపుపేట కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మాణ కలను సాకారం చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఈ మేరకు శనివారపుపేట కాజ్‌వే ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని ఆయన ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఎంఎల్‌ఎకు ఆర్‌అండ్‌బి, మున్సిపల్ అధికారులు మ్యాప్ ద్వారా ప్లాన్‌ను వివరించారు. అనంతరం ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ హామీలు ఇవ్వడమే కాకుండా బాధ్యతగా వాటి అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. శనివారపుపేట బ్రిడ్జిని వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేసే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించామన్నారు. ఈ విషయంలో కలెక్టర్ వెట్రిసెల్వికి ఎంఎల్‌ఎ చంటి ధన్యవాదాలు తెలిపారు. మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కల సాకారం దిశగా కృషి చేసిన ఎంఎల్‌ఎ బడేటి చంటికి, ఆమోదముద్ర వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ ఎంఇ కొండలరావు, ఎఇలు రఫీ, సాయి, ఇతర అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కో – ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు లంకపల్లి మాణిక్యాలరావు, గూడవల్లి వాసు, కడియాల విజయలక్ష్మి పాల్గొన్నారు.



శనివారపుపేట కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

పోలవరంలో వర్షం

ప్రజాశక్తి – పోలవరం

మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. పాఠశాలలు విడిచిపెట్టే సమయం కావడంతో ఉరుములు, మెరుపులకు భయపడిన విద్యార్థులు స్థానిక బస్‌షెల్టర్‌లో తలదాచుకున్నారు. వర్షం తగ్గిన తర్వాత ఇళ్లకు వెళ్లారు. ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.



బస్ షెల్టర్‌లో విద్యార్థులు

పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

కామవరపుకోట : మండలంలోని సాగపాడు శివారు వీరంపాలెంలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసే సమయంలో అకస్మాత్తుగా పిడుగుపడింది. కొబ్బరితోటలో మేతకు వెళ్లిన రెండు గేదెలు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాయి. మృతి చెందిన రెండు గేదెలు గ్రామానికి చెందిన రైతు లాగు నాగరాజుకు చెందినవిగా గుర్తించారు. రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

రైతు శాస్త్రవేత్తల పనితీరు భేష్

మెక్సికో బృందం ప్రశంస

ప్రజాశక్తి – దెందులూరు

రైతు సాధికార సంస్థ రూపొందించిన రైతు శాస్త్రవేత్తల కోర్సు, శాస్త్రవేత్తల పనితీరు అద్భుతమని మెక్సికో ప్రతినిధి బృందం ప్రశంసించింది. సాధారణ రైతు కుటుంబాల నుంచి యువతను ఎంపిక చేసి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం వినూత్న విధానమని కితాబునిచ్చింది. తమ మూడు రోజుల పర్యటనలో భాగంగా మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియానేటివిటీ నేతృత్వంలో మెక్సికో ప్రతినిధి బృందం శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల్లో పాలు పంచుకొంది. మెక్సికో బృంద సభ్యులు పెదవేగి మండలంలోని అమ్మపాలెం గ్రామంలో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్‌లతో ముచ్చటించారు. మెక్సికో బృందం శుక్రవారం ముందుగా ఏలూరు మండలంలోని వెంకటాపురం గ్రామాన్ని సందర్శించి అక్కడ పది మంది కౌలు రైతులు సమిష్టిగా 16 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న వరి పంటను పరిశీలించారు. రైతు సాధికార సంస్థ సూచనల మేరకు కాంపాక్ట్ బ్లాక్ పేరుతో సరికొత్తగా నిర్వహిస్తున్న ఈ నమూనాలో గట్లను వెడల్పు చేయడం ద్వారా కూరగాయలు పండించి రైతులు అదనపు ఆదాయం పొందడం బృంద సభ్యులను ఆకర్షించింది. గట్లపై వేసిన కూరగాయల విక్రయం ద్వారా ఎకరాకు రూ.30 వేలు అదనంగా పొందుతున్నట్లు రైతులు తెలిపారు. వరిగట్లపై పండించిన రసాయన రహిత కూరగాయలను జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో విక్రయిస్తున్నామని, వరి పంట ఉత్పత్తులను శ్రీవారి నైవేద్యం, నిత్యాన్నదానం కోసం తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఎలాంటి రసాయనాల జోలికి వెళ్లకుండా పూర్తిగా జీవ ఎరువులను మాత్రమే వినియోగిస్తున్నట్లు రైతులు తెలిపారు. అనంతరం పెదవేగి మండలంలోని అమ్మపాలెం గ్రామంలో 29 మంది రైతులు కలిసి సమిష్టిగా 32 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న వరి పంటను పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలో మెంటార్‌గా పనిచేస్తున్న రైతు కటారు రంగయ్య వ్యవసాయ క్షేత్రం సందర్శించారు. ఆ క్షేత్రంలో రంగయ్య అమలు చేస్తున్న అయిదు అంతస్థుల నమూనాను క్షుణ్ణంగా పరిశీలించారు. డెయిరీ, కోళ్ల పెంపకంతో పాటు తన రెండున్నర ఎకరాల్లో పండిస్తున్న అనేక రకాల పంటల ద్వారా కేవలం రూ.55 వేలు పెట్టుబడితో ఏడాది కాలంలో రూ.ఐదు లక్షలకుపైగా నికర ఆదాయం పొందినట్లు రంగయ్య బృంద సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారులు అరుణ, సురేష్, మధు ప్రీతి, సరోజ, ఎపిసిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అదనపు మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు విద్యతో పాటు, ఆటలకు సైతం సమ ప్రాధాన్యత ఇవ్వాలని భీమడోలు మండల విద్య శాఖాధికారి భాస్కర్‌కుమార్ కోరారు. భీమడోలు హై స్కూలు వేదికగా శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. 17 అథ్లెటిక్ అంశాలతో పాటు, నాలుగు గేమ్స్, యోగా చెస్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన మండల విద్యాధికారి మాట్లాడుతూ క్రీడలు ప్రస్తుత పరిస్థితుల్లో విద్య నేర్చుకుంటున్న విద్యార్థులపై ఉంటున్న ఒత్తిడిని తగ్గించేందుకు సహకరిస్తాయన్నారు. ఇదేవిధంగా అథ్లెటిక్స్‌తో పాటు గేమ్స్ విభాగంలో వ్యక్తిగత ప్రతిభను కనపరిచిన వారికి మండల స్థాయి జట్టు సభ్యులుగా, ఆ తర్వాత నియోజకవర్గ స్థాయి జట్టు సభ్యునిగా ఆపై జిల్లాస్థాయి జట్టు సభ్యునిగా పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావుతో పాటు పలు పాఠశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఇఒ భాస్కర్‌కుమార్

ముసునూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా మంచి ప్రావీణ్యత సంపాదించాలని ఉప విద్యాశాఖాధికారి సేవియా అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ముసునూరు, ఆగిరిపల్లి, నూజివీడు, చాట్రాయి మండల బాలుర క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ అండర్ 14, అండర్ 17 విభాగంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప విద్యాశాఖాధికారి మాట్లాడుతూ క్రీడల వల్ల ఆరోగ్యంగా ఉంటారని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆటల పోటీలకు మా పాఠశాల కేటాయించడం ఆనందదాయకమని తెలిపారు. డివిజన్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అన్నామణి, లక్ష్మి, వనజ, నాగరాజు, రవీంద్ర, స్వప్న, సాయికృష్ణ, సుకుమార్, రాణి, ఆరతి, సరళ, ఆలీ ఖాన్, నాగేశ్వరరావు, ప్రమీల, శివనాగేంద్రం హర్ష రాజేంద్రప్రసాద్, హేమ, సుధాకర్, సతీష్, ప్రభాకర్, సుగుణరావు, విజయ్, నాగమణి, పుల్లారావు, అర్జున్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల దోమల వ్యాప్తి కొంతవరకు అరికట్టవచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. స్థానిక ఏలూరులోని గొల్లాయగూడెం లక్ష్మయ్య కోనేరు కాలనీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల దోమల వ్యాప్తి కొంతవరకు తగ్గించవచ్చన్నారు. తద్వారా దోమల ద్వారా వచ్చే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులను అరికట్టవచ్చని సూచించారు. అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు మాట్లాడుతూ మనకు ఎక్కువగా హానిచేసే దోమలు మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. దోమల నిర్మూలన ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం మలేరియా అధికారి ఇంటింటికి వెళ్లి దోమల నిర్మూలన పట్ల అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మయ్య అంగన్వాడీ కేంద్రం-107ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ అప్పలస్వామి కాలనీ పిహెచ్‌సి వైద్యాధికారి నవ్య, మలేరియా హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, రమేష్‌బాబు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 55 మంది ఎంపిక

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని వీరిశెట్టిగూడెం అడ్డరోడ్డు సమీపంలోని ఎన్‌టిఆర్ మహిళా ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 124 అభ్యర్థులు హాజరయ్యారని, వీరిలో 55 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలిపారు. అదే శిక్షణ కేంద్రంలో డ్రైవింగ్ కోర్సు పూర్తి చేసుకున్న 30 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించినట్లు ఆయన చెప్పారు. ఈ జాబ్‌మేళాలో ఎస్ఎస్ఐ (అరబిందో ఫార్మా), లర్నర్ ల్యాండ్ లోర్డ్ యూనివర్సల్ ప్రాజెక్ట్, బజాజ్ క్యాపిటల్, అజీజాన్ (కెఎల్ గ్రూప్), జీనియస్ కన్సల్టెన్సీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మధుసూదనరావు, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ రెబెకా శామ్యూల్, జంగారెడ్డిగూడెం సిడిపిఒ పి.బ్యూలా, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్, కో-ఆర్డినేటర్లు కార్తీక్, సురేష్, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నివారణ

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టనున్నట్లు వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. దుద్దేపూడి గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వరిపై కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాటి నివారణకు రసాయన మందుల స్థానంలో సేంద్రియ వ్యవసాయ విధానాల్లో భాగంగా అగ్ని అస్త్రం ద్రావణాన్ని వినియోగించాలని సూచించారు. దీని తయారీ గురించి రైతులకు తెలియజేశారు. ఆ తర్వాత సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం చేపడుతున్నందున ముందు, తర్వాత తీసుకోవాల్సిన వివిధ జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి : ఎలుకలను నిర్మూలించుకుంటే వరి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి తెలిపారు. మండలంలోని ఆర్‌బికెలలో సామూహిక ఎలుకల నివారణపై శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలుకలు వరి పంటను నాశనం చేస్తాయన్నారు. దీంతో వరి పంటలో అధికంగా దిగుబడి ఉండదన్నారు. దీంతో రైతులు నష్టపోయే పరిస్థితులు ఉంటాయన్నారు. ప్రతి రైతు ఎలుకలను నివారించుకునేవిధంగా బ్రోమోడియోలిన్ మందును రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి రైతు ఈ మందును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ జరీనా, విఎఒలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు



బోల్తా పడిన చేపల లోడు కంటైనర్

చేపల లోడు కంటైనర్ బోల్తా

పది మందికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎదురుగా వెళ్తున్న మినీ వాహనాన్ని చేపల లోడు కంటైనర్ వెనుక నుంచి ఢీకొని వేగ నియంత్రణ కోల్పోవడంతో కంటైనర్ రోడ్డుకు అడ్డంగా, మినీ వ్యాన్ రోడ్డు డివైడర్ మధ్యలో బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లతో పాటు మరో ఎనిమిది మంది కూలీలు గాయాలపాలయ్యారు. ఈ ఘటన జాతీయ రహదారి నారాయణపురం - ఉంగుటూరు మధ్యలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భీమడోలు మండలం ఆగడాలలంక చెరువులో చేపలను జితేంద్ర అనే వ్యాపారి కొనుగోలు చేశాడు. శుక్రవారం ఉదయం పట్టుబడి పట్టి అక్కడే కూలింగ్ చేశారు. అనంతరం ఉంగుటూరు బాలాజీ ఐస్ ఫ్యాక్టరీకి ప్యాకింగ్ నిమిత్తం సుమారు 150 ట్రేల్లో కంటైనర్ వాహనం బయలు దేరింది. ఈ క్రమంలో ఉంగుటూరు ప్రసాద్ థియేటర్ దాటాక ఎదురుగా వెళ్తున్న మినీ వాహనాన్ని చేపల లోడు కంటైనర్ వెనుక నుంచి ఢీకొని వేగ నియంత్రణ కోల్పోవడంతో కంటైనర్ రోడ్డుకు అడ్డంగా, మినీ వ్యాన్ రోడ్డు డివైడర్ మధ్యలో బోల్తా పడ్డాయి. ఆ సమయంలో కంటైనర్‌లో ట్రేల మధ్యలో ఇద్దరు జట్టు కూలీలు, క్యాబిన్‌లో డ్రైవర్, మరో ఏడుగురు కూలీలున్నారు. వాహనం రోడ్డుకు అడ్డంగా బోల్తా పడడంతో కంటైనర్‌లో చేపల ట్రేల వద్ద కూర్చున్న ఇద్దరు కూలీలతో చేపలు ట్రేలు పడిపోయాయి. ఆ ఇద్దరు కూలీలకు వెంటనే హైవే అంబులెన్సులో ఆక్సిజన్ ఎక్కించడంతో స్పృహలోకి వచ్చారు. క్యాబిన్‌లో ఉన్న మిగతా వారిని స్థానికులు బయటకు లాగారు. పోలీసులు వారిని, మినీ వ్యాన్ డ్రైవర్‌ను అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారంతా ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీ కొత్తగూడేనికి చెందిన జట్టు కూలీలుగా పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో పి.తాతారావు, మడిచెర్ల శ్రీను, ఎస్.రాజారావు, గంటా చిరంజీవి, ఎం.మున్నీ, జి.దుర్గాప్రసాద్, కె.వెంకట్, జి.శ్రీను, పి.అనిల్, నూరెల్ల ఉన్నారు. ప్రమాద విషయం తెలియగానే ఉంగుటూరుకు చెందిన యువకులు బండారు మధు ఆధ్వర్యంలో మిత్ర బృందం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పోలీసులు, హైవే పెట్రోలింగు సిబ్బందికి సహకరించారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పంచాయతీ బిసి కాలనీలో వీధి కుక్కలు మందలుగా రోడ్లపై సంచరిస్తూ శుక్రవారం గణేష్‌నగర్‌కి చెందిన ఓ చిన్నారిపై, బిసి కాలనీకి చెందిన టైలర్‌పై దాడి చేశాయి. స్థానికులు కుక్కలను తరిమికొట్టడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. కుక్కల దాడిలో గాయాలపాలైన ఇద్దరితో పాటు కార్మెల్ పురం నుంచి మరి కొంతమంది పోలవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రధానంగా మెయిన్ సెంటర్‌లో చికెన్ షాపుల వద్ద గుంపులుగా సంచరిస్తూ పాఠశాలలకు రాకపోకలు సాగించే విద్యార్థులపై, వాహనదారులపై మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రికి వెళ్లే దారిలో కుక్కల గుంపు ఉంటుంది. రాత్రి సమయంలో ప్రభుత్వాసుపత్రికి వెళ్లేందుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన రహదారుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా ఉండడంతో స్థానికులు బయటకు రావడానికి భయపడుతున్నారు. దీంతో ప్రజలు రోడ్డుపై సంచరించాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూళ్లలో పోషకాహార మహోత్సవాలు

ప్రజాశక్తి - భీమడోలు

ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని పూళ్ల సెక్టార్‌లో కొనసాగుతున్న పోషకాహార మహోత్సవాలతో పాటు ఆరోగ్య పరిరక్షణకు సైక్లింగ్, నడక ఇతర వ్యాయామ ప్రక్రియల గురించి వివరిస్తూ ర్యాలీలు నిర్వహించడం పలువురిని ఆకట్టుకుంటున్నాయి. సెక్టార్ పర్యవేక్షకురాలు నూర్జహాన్ బేగం ఆధ్వర్యంలో కురెళ్లగూడెంలో ఈ తరహా కార్యక్రమాలను గురువారం పాఠశాల విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది భాగస్వామ్యంతో నిర్వహించారు. తొలుత పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, కౌమార బాలికలకు పోషకాహార విలువల పట్ల అవగాహన కల్పించారు. పోషకాహారం లోపం వల్ల కలిగే ఇబ్బందులు దాన్ని అధిగమించే విధానాల గురించి తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి చెప్పారు. ఆ తర్వాత ఆరోగ్య పరిరక్షణకు సైక్లింగ్, నడక చేసే ఉపకారాలను తెలియజేయడంతో పాటు పురవీధుల్లో సైకిల్, నడక ర్యాలీలను నిర్వహించారు.



భీమడోలులో...

పలుచోట్ల 'స్వచ్ఛతా హి సేవ'

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా ఎంపిడిఒ పద్మావతి దేవి ఆధ్వర్యంలో నాలుగో రోజైన శుక్రవారం కొనసాగించారు. దీనిలో భాగంగా భీమడోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద తల్లి పేరున మొక్క నాటే కార్యక్రమాన్ని ఎంపిడిఒ ప్రారంభించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మొక్కలు సంరక్షించే కార్యక్రమం చేపడతామన్నారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు గుర్తింపు కార్డులను అందించారు. వారికి బ్యాంకు రుణాలను అందించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తర్వాత పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకించిన వైద్య శిబిరంలో పాల్గొని, వారికి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి సుందరి, పంచాయతీ కార్యదర్శి సూర్య పాల్గొన్నారు. పొలసానిపల్లిలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకరమైన వాతావరణంలో వ్యాపారాలు చేసుకోవాల్సిన విధానాల గురించి వివరించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

మండవల్లి : మానవుల ఆరోగ్యవంతమైన జీవితానికి వృక్షాలు ఎంతో అవసరమని ఇఒపిఆర్‌డి ఆనంద్‌బాబు స్పష్టం చేశారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటడంతో పాటు అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి మొక్కల ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పర్యావరణంలో కాలుష్యం పెరిగిపోయి వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. అంతేకాకుండా కాలుష్యం మానవుల ఆరోగ్యలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా కొవ్వాడ లంకలో సర్పంచితో పాటు అటవీ శాఖాధికారులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాల్లో పలు గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్

ప్రజాశక్తి - కుక్కునూరు

విఆర్ఎల్లో అర్హులైన వారికి ప్రమోషన్స్ ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశం పోచారపు వెంకన్నబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు, అధికారుల మధ్య వారధిగా పని చేస్తున్న విఆర్‌ఎలు చాలీచాలని గౌరవ వేతనంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో చాలచోట్ల అటెండర్, నైట్ వాచ్‌మెన్, గ్రేడ్-2, విఆర్‌ఒ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని అర్హులైన విఆర్‌ఎలతో భర్తీ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని చెప్పారు. లేకుంటే అందరిని ఐక్యం చేసి పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిఐటియు మండల సహాయ కార్యదర్శి కాకర్ల శ్రీను, విఆర్‌ఎలు భూక్య చందు, శివ, శంకర్, చినరాజు, నాగమణి, శేఖర్, నరసింహ, పోశమ్మ పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది బాధ్యతగా మెలగాలి

సిఐ బి.వెంకటేశ్వరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలీస్ సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా మెలగాలని జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరావు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందిచే నిర్వహించినలో పరేడ్‌లో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతిరోజు కొంతసేపు వ్యాయామం చేసి విధులు నిర్వహించడం ద్వారా ఒత్తిడికి లోను కాకుండా ఉంటారని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్ కుమార్, మహేశ్వరరావు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వరరావు

ఉత్తమ ఉపాధ్యాయులతోనే అత్యుత్తమ సమాజం

ప్రజాశక్తి - మండవల్లి

ఉత్తమ ఉపాధ్యాయులతోనే ఉత్తమ సమాజం సాధ్యపడుతుందని అయ్యవారి రుద్రవరం సర్పంచి బోనం శేషగిరి స్పష్టం చేశారు. ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయుడు చిరిగిరి పిచ్చోడు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో స్థానిక పాఠశాలలో శుక్రవారం ఆయనను ఘనం గా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఉత్తమమైన విద్యార్థులపైనే ఆధారపడి ఉంద న్నారు. అలాంటి విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యా యుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఉత్తమమైన సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. దేశం గర్వించదగ్గ ఉత్తమమైన విద్యార్థులను తీర్చిదిద్ది మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలతో దుశ్శాలువతో ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ఇంటి నాగరాజు, ఎంపిటిసి సభ్యులు నాని, ఎస్ఎంసి ఛైర్మన్ విజయశాంతి, ఉపాధ్యాయులు బెన్నీ పాల్ రూప్ కుమార్, బలరాం, శోభారాణి, జయశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పిచ్చోడు దంపతులను సత్కరిస్తున్న సర్పంచి, తదితరులు

నేను బతికే ఉన్నాను.. నా భూమి నాకు అప్పగించండి

ఏలూరు డిఎస్‌పిని ఆశ్రయించిన మహిళ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నేను బతికే ఉన్నా గ్రామ పెద్దలు, గ్రామ సచివాలయ సిబ్బంది కలిసి చనిపోయినట్లు సర్టిఫికెట్ పుట్టించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ ఏలూరు డిఎస్‌పిని ఆశ్రయించింది. వివరాల ప్రకారం... ఘంటసాల రాణి ప్రతికోళ్లలంక గ్రామంలో నివాసం ఉంటుంది. ఆమెకు 70 సెంట్లు భూమి ఉండేది. ఊరి పెద్దలు అయిన ఘంటసాల నాగార్జున, సైదు వీరయ్య అనే వ్యక్తులు ఘంటసాల రాణి మృతి చెందిందని పెద్దల సమక్షంలో తీర్పులు తీర్చి అదే విషయాన్ని పంచాయతీ పెద్దలకు తెలిపారు. దీంతో పంచాయతీ సెక్రటరీ కూడా ఆమె మృతి చెందిందని 2007లో డెత్ సర్టిఫికెట్ కూడా మంజూరు చేశారు. ఈ డెత్ సర్టిఫికెట్‌ను అనుసరించి ఆమెకు ఉన్న 70 సెంట్ల భూమిని అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం 2012 వరకు రాణికి తెలియలేదు. ఆమెకు తెలిసిన తర్వాత నుంచి 12 ఏళ్లుగా తాను బతికే ఉన్నానని గ్రామ పెద్దలకు చెబుతున్నా ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం ఏలూరు డిఎస్‌పిని ఆశ్రయించి తాను బతికే ఉన్నానని, తన భూమిని తనకు ఇప్పించాలని కోరింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఆరో నెల 30వ తేదీ రూరల్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం డిఎస్‌పిని ఆశ్రయించింది. దీనిపై ఏలూరు రూరల్ ఎస్ఐను వివరణ కోరగా ఈ ఘటనపై ఇప్పటికే విచారణ జరుపుతున్నామని, రెండు, మూడు రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు.



బాధిత మహిళ

'వంద రోజుల్లోనే ప్రజలకు పలు సంక్షేమ పథకాలు'

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వందరోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చేలా ప్రత్యేక దృష్టి సారించి కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ప్రజాప్రభుత్వంగా కూటమికి మంచి పేరు వచ్చిందని, ఇదేస్ఫూర్తితో ఇది మంచి ప్రభుత్వమనే పేరుతోనే ప్రజావేదిక కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం రూపకల్పన చేసిందని ఆయన వివరించారు. 47వ డివిజన్ తిలక్ నగర్‌లో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ ప్రారంభించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి కార్పొరేటర్ వందనాల దుర్గాభవానిని డిప్యూటీ మేయర్‌గా ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వందరోజుల్లో ఏ ఒక్కరోజు కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా లేనని, ఈ విధంగానే రానున్న ఐదేళ్లుప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజలకు నూటికి నూరుశాతం మేలు చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ఏకైక లక్ష్యమన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నాయకులు మధ్యాహ్నపు బలరాం, బొద్దాని శ్రీనివాస్, దాసరి ఆంజనేయులు, వందనాల శ్రీనివాస్, ఆర్నేపల్లి తిరుపతి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : ప్రజల సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వం ధ్యేయమనిటిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజల మంచిని ఆకాంక్షించి ప్రజా ఆశీస్సులతో అఖండ విజయం సాధించిన కూటమి వంద రోజుల్లోనే ప్రధానమైన హామీలను నెరవేర్చిందని చెప్పారు. నూజివీడులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవ్వాతాతల పెన్షన్లను రూ.నాలుగు వేలకు పెంచుతానని ఇచ్చిన హామీ మేరకు మూడు నెలల్లో బకాయిలతో కలిపి మొత్తం పింఛను ఇస్తున్నారన్నారు. ప్రజల ఆస్తి హక్కును సైతం ప్రశ్నార్థకం చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు. విజయవాడ వరదల్లో ప్రజల రక్షణకు చర్యలు చేపట్టారన్నారు. అన్నాక్యాంటీన్లను తెరిచి పేదలకు ఐదు రూపాయలకే అన్నాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. దైవ సేవలోనూ నాసిరకపు ఆహార పదార్థాలను వినియోగించారంటే జగన్‌కు దేవుడంటే కూడా భయం లేదని అర్థమవుతుందన్నారు. ఉగాది రోజున దైవ దర్శనానికి వెళ్లాల్సిన జగన్ తన ఇంటి వద్ద దేవాలయాన్ని సెట్టింగ్ రూపంలో ఏర్పాటు చేయించాడన్నారు.

ముసునూరు : మంచి ప్రభుత్వం వందరోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు కార్యక్రమాలను ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు గ్రామ సర్పంచి చలసాని దామోదరరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర చెప్పారు. మండలంలోని వలసపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి ఎస్‌వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. పి.రాజవరం గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తుల నుంచి పలు వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవి, సీనియర్ నాయకులు పారేపల్లి రామారావు, టిడిపి, జనసేన మండలాధ్యక్షులు ఎస్.సాయి, పి.రాము, నాయకులు సాంబ, మహేష్, సాయి పాల్గొన్నారు.

కామవరపుకోట : మండలంలోని తడికలపూడి గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ మురళీరామకృష్ణ హాజరై మాట్లాడారు. టిడిపి మండలాధ్యక్షుడు కిలారు సత్యనారాయణ మాట్లాడుతూ వంద రోజుల్లో ప్రజా ఉపయోగకరమైన మెగా డిఎస్‌సి, పింఛన్ పెంపుదల, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల ప్రారంభం వంటి తదితర వంద మంచి పనులు చేసిందని, రానున్న రోజుల్లో కూడా ప్రజల ఆకాంక్షలు, అవసరాలు గుర్తించి వాటికి అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ఈ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు తూతా లక్ష్మణరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు బొంతు వెంకటేశ్వరరావు, డిసిసిబి మాజీ డైరెక్టర్ బొప్పన అంజయ్య, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జుజ్జూరి బాబ్జి, మొట్టికాయల నాగయ్య, మెరుగు రాంబాబు, గోపీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని వడాలి గ్రామంలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో నిర్వహించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురువు సుబ్రహ్మణ్యం, కట్టా కోటయ్య, మట్టా మల్లేశ్వరరావు, రాజులపాటి శ్రీనివాసరావు, మహంకాళి, మట్టా రామయ్య పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

కారాగారం సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి కారాగారాన్ని న్యాయ సేవాధికార సంస్థ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు, తదితర విషయాలు ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు, అందించే సహాయంపై ఆరా తీశారు. వంటశాల, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలోని 33 కెవి ఏలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మహేశ్వర కాలనీలో ఆదివారం వినాయక నిమర్జనం సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఊరేగింపు అయ్యే వరకు అముదాల అప్పల స్వామి కాలనీ, మహేశ్వర కాలనీ, వంగాయగూడెం, కైకలూరు బైపాస్ రోడ్డు, గాంధీ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

28 వరకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 2024-25 అడ్మిషన్ల కోసం ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 28 వరకు పొడిగించారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29, 30 తేదీల్లో రూ.200 అపరాధ రుసుముతో అడ్మిషన్లు చేసుకోవటానికి సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం గుంటూరు వారు అవకాశం కల్పించారని తెలిపారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ద్వారా www.apopenschool.ap.gov.in వెబ్ సైట్‌లో గాని AP ON-LINE ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

ఫెర్రీ రేవులో నిమర్జన విగ్రహాలు తొలగింపు

ప్రజాశక్తి - పోలవరం

గణపతి నవరాత్రుల సందర్భంగా మండలంలో పలు గ్రామాల నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి పట్టిసీమ ఫెర్రీ రేవులో నిమర్జనం చేసిన విగ్రహాలను శుక్రవారం పట్టిసీమ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి తాతీ విజయకుమారి మాట్లాడుతూ నిమర్జనం రోజుల్లో గోదావరి నీటిమట్టం ఎక్కువగా ఉండడంతో నిమజ్జనం చేసిన విగ్రహాలు వరద ప్రవాహంలో కొట్టుకుపోకుండా మెట్లపైనే ఉండిపోయాయన్నారు. కార్తీక మాసం భక్తుల పూజలు, స్నానాలు, పట్టిసీమ శివక్షేత్రానికి రాకపోకలు సాగించేందుకు విగ్రహాలు అవాంతరాలుగా ఉన్న నేపథ్యంలో సిబ్బందితో తొలగించామని చెప్పారు. మూడు రోజులుగా సిబ్బంది విగ్రహాల తొలగింపు పనులు, మెట్లదారి శుభ్రత పనులు నిర్వహిస్తున్నారన్నారు. సుమారు 120 భారీ విగ్రహాలను మెట్ల మార్గం నుంచి తొలగించినట్లు కార్యదర్శి తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుని పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.జాస్మిన్ శుక్రవారం తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంఎలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకుని 24వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9553962884 సంప్రదించాలని తెలిపారు.